క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: పూడూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పూడూర్, గోసాయిగూడ గ్రామాల్లో డొమెస్టిక్, అగ్రికల్చర్ సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

'ఎంపీఎల్' ప్రారంభం



స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న వేణుగోపాల్

ఘట్‌కేసర్: మాదారం ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను మాదారం గ్రామంలో ముఖ్యఅతిథులుగా హాజరైన స్థానిక సర్పంచ్ యాదగిరి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌లు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ సొంత డబ్బుతో క్రికెట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మహిపాల్, సంజీవ, టోర్నమెంట్ నిర్వాహకులు ప్రభాకర్, దయాకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

'కబ్జాలతో నాకు సంబంధం లేదు'

మేడ్చల్: కిష్టాపూర్‌లో చోటు చేసుకున్న కబ్జాలతో తనకెటువంటి సంబంధం లేదని మేడ్చల్ మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ తుడుం గణేష్ అన్నాడు. వార్డుకు చెందిన కొంత మంది మధ్య భూమి విషయంలో తగదా ఉండగా కౌన్సిలర్‌గా తనను పిలిస్తే అక్కడకు సమస్య పరిష్కారం కోసం వెళ్లానని, కొందరు తనపై కక్షతో పోలీసులకు తప్పుడు సమాచారమిచ్చి తనపై కేసులు పట్టించారన్నారు. వివాదంలో ఉన్న గ్రామ కంఠం భూమి తమ బంధువులదని, తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. దళితుడైన తాను రాజకీయంగా ఎదుగుతున్నానని ఓర్వలేక కొంతమంది తనపై అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని గణేష్ అన్నారు.

మేదరులను ఎస్టీలో చేర్చాలి

పోచారం: సమాజంలో ఆర్థికంగా వెనుక బడిన మేదరి కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని మేదరి సంఘం నాయకుడు కోన మల్లేష్ కోరారు. ఇతర రాష్ట్రాల్లో మేదరి కులస్తులు ఎస్టీ జాబితాలో ఉంటే తెలంగాణలో బీసీలుగా పరిగణించబడుతున్నారని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి బోయలతో పాటు మరికొన్ని కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని తీర్మానం చేసినట్లే మేదరుల విషయంలో నిర్ణయం తీసుకోవాలన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక



రమేశ్‌ను అభినందిస్తున్న కాలనీ వాసులు

ఘట్‌కేసర్: అవుషాపూర్ శ్రీవేంకటేశ్వర నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గుజ్జ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కాలనీలో నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిని శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్, సత్యనారాయణ, రమేష్, శ్యామ్, మహేష్ ఉన్నారు.


'న్యూ లిటిల్ లిల్లి' విద్యార్థుల సత్తా



కబడ్డీ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు


మేడ్చల్: రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీల్లో మేడ్చల్‌కు చెందిన న్యూ లిటిల్ లిల్లి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. నగరంలో బాల వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో న్యూ లిటిల్ లిల్లి పాఠశాల విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. దీంతో విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మంజుల ప్రకాష్, పీఈటీ వెంకట్, ఉపాధ్యాయులు తిరుపతి ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన



అమ్మవారిని దర్శించుకుంటున్న మర్రి రాజశేఖర్ రెడ్డి, పావనీయాదవ్, మాధవరెడ్డి, కౌన్సిలర్లు

ఘట్‌కేసర్: కొండాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీనల్లపోచమ్మ, శ్రీఎర్ర పోచమ్మ ఆలయంలో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలో బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, స్థానిక కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, హేమలతగోపాల్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు మల్లేశ్, ఆంజనేయులుగౌడ్, రమాదేవి, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, జంగయ్య యాదవ్, రవికాంత్‌రెడ్డి, రాధాకృష్ణముదిరాజ్ ఉన్నారు.



బొక్కొనిగూడ చౌరస్తాలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్‌చైర్మన్ మాధవరెడ్డితో కలిసి ఆదివారం మెడికల్ మార్ట్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంటరీ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి. చిత్రంలో జంగయ్యయాదవ్, సుశాంత్. - ఘట్‌కేసర్



కీసరగుట్టపైన గల శ్రీభవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం






గర్భాలయంలో కొలువైన స్వామివారు



ఆలయంలో అమ్మవారు



ఆంజనేయస్వామి విగ్రహం

ఈశ్వరా.. శ్రీరామలింగేశ్వరా..

విజయానికి చిహ్నంగా కీసరగుట్ట శ్రీభవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం

ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరుగా శైవక్షేత్రం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కీసరగుట్ట ఆలయంపై 'సాక్షి' ప్రత్యేక కథనం

కీసరగుట్ట రాష్ట్ర రాజధానికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ ప్రఖ్యాత శైవక్షేత్రం. శ్రీభవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి కొలువుదీరి ఉన్న చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ఈ పుణ్యక్షేత్రం విజయానికి చిహ్నంగా భక్తులచే కొనియాడబడుతోంది. ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరుగా కీసరగుట్ట పేరు గాంచింది. ఇక్కడ ప్రతి యేడు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కీసరగుట్టలో ఆలయ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. నగరానికి చేరువలో ఈ దేవాలయం ఉండటంతో లక్షల్లో భక్తులు, యాత్రికులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. కీసరగుట్టకు వచ్చే యాత్రికులకు ఇక్కడ ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదభరితమైన ప్రకృతిని ఆస్వాదించేందుకు అనువుగా ఉంటుంది. కాగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కీసరగుట్ట అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. గతంలో సీఎం పేషి నుంచి (సీఎం ప్రత్యేక కార్యదర్శి) భూపాల్‌రెడ్డి కీసరగుట్టలో అధికారులతో కలిసి పర్యటించి గుట్ట అభివృద్ధికి రూ.75 కోట్ల మేర ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసిన సంగతి విదితమే. ఈ నెల 16 నుంచి 21వ వరకు జరిగే కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్ట క్షేత్ర ప్రత్యేక కథనం. – కీసర

ఆలయ నేపథ్యం...

కీసరగుట్టలో భక్తులచే పూజింపబడుతున్న శ్రీరామలింగేశ్వరుడు స్వయంగా శ్రీరాముడిచే ప్రతిష్ఠించబడినట్టు పురాణ కథనం. తపస్సు ద్వారా రావణుడు బ్రహ్మత్వం పొందాడు. రావణబ్రహ్మను హతమార్చినందున బ్రహ్మహత్యాదోశం అంటకుండా శ్రీరాముడు ఇక్కడ శివలింగార్చన చేయాలనుకుంటాడు. కాశీ నుంచి శివలింగం తెమ్మని హనుమంతుడిని పంపిస్తాడు. సమయం మించిపోతున్నా హనుమంతుడు రాకపోయే సరికి శ్రీరాముడి ప్రార్థన ఆలకించిన శివుడు స్వయంగా లింగ రూపంలో దర్శనమిస్తాడు. ఆ శివలింగాన్నే శ్రీరాముడు ప్రతిష్ఠించి పూజిస్తాడు. పూజా కార్యక్రమాలు పూర్తయ్యాక 108 శివలింగాలతో ఇక్కడకు వచ్చిన హనుమంతుడు పూజకు నోచుకోకపోవడంతో చిరాకు పడి తోకతో వాటిని విసిరేస్తాడు. అలక చెందిన హనుమంతున్ని శ్రీరాముడు ఓదారుస్తూ తాను ప్రతిష్ఠించిన శివలింగం దర్శనం చేసుకున్నాక.. హనుమంతుడు తెచ్చిన శివలింగాల్లో ఏదో ఒక దానిని ఇక్కడికి వచ్చే భక్తులు పూజిస్తేనే యాత్ర సఫలం అవుతుందని, దీంతో ఇక నుంచి ఈ ప్రాంతం (హనుమంతుడికి కేసరి అనే పేరు కూడా) వర్ధిల్లుతుందని వరం ఇస్తాడు. ఈ ప్రాంతంలో సింహాలు ఎక్కువగా సంచరించినందున హనుమంతుడికి కేసరిగా నామకరణం చేసి ఈ స్థలాన్ని కేసరిగిరిగా ప్రకటిస్తాడు. మిగతా పురాణగాథలు ఎన్ని ఉన్నా.. ఈ గాథే ప్రజల నోళ్లలో అనాదిగా నానుతోంది. కేసరిగిరి కాల క్రమేణా కీసరగుట్ట రూపాంతరం చెందింది.

ఆలయ ప్రత్యేకతలు...

కీసరగుట్ట ఆలయానికి మూడు ప్రత్యేకతలు ఉన్నాయి. ఇక్కడ శివాలయం పశ్చిమాభిముఖంగా ఉంటుంది. గర్భగుడిలో ఉన్న శివలింగం సైకత లింగం(ఇసుకతో చేయబడిది)గా ప్రసిద్ధి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ శివాలయానికి ఎదురుగా హనుమంతుడిచే విసిరివేయబడ్డట్టుగా చెబుతున్న శివలింగాలు చెల్లాచెదురుగా పడి ఉంటాయి. కీసరగుట్ట, దాని పరిసర ప్రాంతాల్లో 107 శివలింగాలు ఉండగా.. చివరి లింగం నల్గొండ జిల్లా కొలనుపాకలో ఉంది. ఈ శివలింగాలకు భక్తులు తైలాభిషేకాలు చేస్తారు. కాగా ఇక్కడ జైన విగ్రహాలు కూడా ఉండటం మరో విశేషం.

చారిత్రక ప్రశస్తి..

- కీసరగుట్ట ప్రాంతాన్ని క్రీస్తు పూర్వం 4 నుంచి 6వ శతాబ్దం వరకు విష్ణుకుండీనులు పాలించినట్లు చారిత్రక ఆధారాలు లభ్యమయ్యాయి. పుట్టుకతో బ్రాహ్మణులై క్షత్రియులుగా (బ్రహ్మ క్షేత్రో భృతులు) వ్యవహరించిన విష్ణుకుండీనులు కీసర గుట్టను విజయానికి చిహ్నంగా భావించి ఆయుధగారంగా అభివృద్ధి చేశారు. వీరి ముద్రిక కూడా లఘించు సింహం(కీసర)గా ఉండేది. తెలుగును రాజ భాషగా అభివృద్ధి చేసిన వీరు ఇక్కడ అశ్వమేథ యాగాలు, వెయ్యి అగ్రిష్టోమాదులు చేసినట్టు తెలుస్తోంది. విష్ణుకుండీనుల్లో శ్రేష్టుడైన రెండో మాధవర్మ నరమేధయాగం ఇక్కడే చేసినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ ప్రాంతం ప్రాచీన కాలంలో యజ్ఞక్రతువులతో వర్ధిల్లినట్లు తెలుస్తోంది. పురావస్తు శాఖ వారు జరిపిన తవ్వకాల్లో విష్ణుకుండీనుల కాలం నాటి అవశేషాలు, నాణెములు, మట్టిపాత్రలు, అలంకరణ వస్తువులు, రేకులు, రాజప్రసాదాలు బయటపడ్డాయి.
- క్రీస్తు శకం 13వ శతాబ్దంలో కాకతీయ రాజు కూడా కీసరగుట్టను అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. ఆలయం పక్కన ఏక శిలాస్తంభం వీరే ఏర్పాటు చేసినట్లు చెబుతారు. వీరి హయాంలోనే హరిహర క్షేత్రంగా కీసరగుట్ట వర్ధిల్లిందంటారు.
- గోల్కొండ నవాబుల కాలంలో మంత్రులుగా ఉన్న అక్కన్న మాదన్నలు ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని ఆలయం పక్కనే హైందవ, యవన సాంప్రదాయంతో ఆలయాలు నిర్మించారు. లక్ష్మీనరసింహ స్వామి తదితర దేవుళ్ల విగ్రహ ప్రతిష్ఠ చేయాలనుకున్న అక్కన్న, మాదన్నలు గోల్కొండలో హతమార్చబడినందున ఈ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ జరగలేదు.
- కాగా ఇటీవలే జీర్ణోద్ధరణ చేసి యోగ నర్సింహ, శ్రీరామ చంద్ర విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు.
- ఇటీవల కీసరగుట్ట ఆర్కాలజీ మ్యూజియం గల రాజప్రసాదాల చుట్టు పాత్‌వే నిర్మాణంలో భాగంగా జరిపిన తవ్వకాల్లో జైనతీర్థుల విగ్రహాలు కుడా బయటపడ్డాయి. జైనమత సంరక్షణ సంస్థ ప్రతినిధులు కుడా కీసరగుట్ట తవ్వకాల్లో బయట పడ్డ జైన తీర్థంకుల విగ్రహాలు పరిశీలించారు. దీంతో ఇక్కడ జైనమతం కూడా కొనసాగినట్లు వెల్లడైయిందని పురావస్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఈ సారి బ్రహ్మోత్సవాలు...

ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కీసరగుట్టలోని శ్రీభవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందు కోసం ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం జిల్లా అధికార బృందం ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తోంది.

కీసర గుట్టకు వెళ్లేదెలా..?

సాధారణ రోజుల్లో కీసరగుట్టకు సికింద్రాబాద్ నుంచి బస్సు సౌకర్యం ఉంది. ఈసీఐఎల్ నుంచి 15 కిలో మీటర్లు ప్రయాణిస్తే కీసరగుట్ట వచ్చేస్తుంది. ఇక బ్రహ్మోత్సవాల సందర్భంగా నగరంలోని అన్ని ప్రాంతాలతో పాటు యాదాద్రి తదితర జిల్లాల్లోని గ్రామాల నుంచి ఆర్టీసీ వారు 200 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఇక యాత్రికుల సౌకర్యార్థం పున్నమి హోటల్, టీటీడీ ధర్మశాల, గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయి.



తెల్లతామర కొలను



గుట్టకు సమీపంలో శివలింగాలు



వేద పాఠశాల



హుడాపార్కు



సీతమ్మగుహ

కీసరగుట్టలో చూడదగ్గ ప్రాంతాలు...

సీతమ్మగుహ: ఏకశిలతో ఏర్పడిన సీతమ్మ గుహ చూపరులను ఆకర్శిస్తోంది. మహిశా సురమర్థినీ ఆలయం ఈ గుహలో ఉంది. ప్రధాన ఆలయానికి ఈశాన్యంలో ఈ సీతమ్మ గుహ ఉంది. భక్తులు వెళ్లడానికి ఇటీవల కొత్తగా ఆలయం నుంచి సీతమ్మ గుహ వరకు మెట్లు ఏర్పాట్లు చేశారు.

శివలింగాలు: స్వామి వారి దర్శనానంతరం ప్రధాన ఆలయానికి ఎదురుగా ఉన్న 101 శివలింగాలను యాత్రికులు దర్శించుకోవచ్చు. బ్రహోత్సవాల సందర్భంగా శివలింగాలకు భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించడం ఆనవాయితీ.

తామర కొలను: ప్రధానకొండ దిగువ భాగంలో తెల్ల తామర కొలను యాత్రికులకు ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. గుట్ట ప్రాంతమంతా అక్కడిక్కడ ఉన్న రాతి మండపాలు శిథిలమైన ఆయాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింబిస్తాయి. ఈ ప్రదేశాలను చూస్తే కీసరగుట్ట ఆలయం ఎంత పూరాతనమైనదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

హుడాపార్కు: యాత్రికులు సేద తీరేందుకు కీసరగుట్ట దిగువ ప్రాంతంలో ప్రభుత్వం హుడా పార్కును అభివృద్ధి చేసింది. సుమారు 20 ఎకరాల్లో ఈ పార్కును సుందరంగా అభివృద్ధిపరిచారు. స్వామి దర్శనానంతరం భక్తులు ఈ పార్కులో సేద తీరవచ్చును.

ఆంజనేయ స్వామి విగ్రహం: కీసరగుట్టలో భక్తులు విరాళాలతో గతంలో ఇక్కడ 32 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. యాత్రికులకు ఈ విగ్రహం ఎంతో కనువిందు చేస్తోంది.

ఏకశిల స్తంభం: కీసరగుట్టలో అలనాటి రాజుల పాలనకు చిహ్నంగా ఉన్న ఏకశిల స్తంభాన్ని యాత్రికులు చూడవచ్చు.

టీటీడీ వేద పాఠశాల: కీసరగుట్ట దిగువ ప్రాంతంలో టీటీడీ వారిచే నిర్వహిస్తున్న వేదపాఠశాలను యాత్రికులు తిలకించవచ్చు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు, గురుకుల విద్యా తరహాలో కొనసాగుతున్న వేద పాఠశాలను సందర్శించవచ్చు. ఇటీవల ఇక్కడ సుమారు రూ.3 కోట్ల వ్యయంతో వేద విద్యార్థుల సౌకర్యార్థం వివిధ భవనాలను టీటీడీ నిర్మించింది.

విష్ణుకుండీనుల రాజ ప్రసాదాలు: కీసరగుట్టను ఆయుధగారంగా ఏర్పాటు చేసి పాలన కొనసాగించిన విష్ణుకుండీనుల చరిత్రకు ఆనవాలుగా, రాజప్రసాదాలు, నాణేలు ఇటీవల బయట పడ్డ జైన తీర్థంకులు (జైనుల విగ్రహాలు) తదితర అవశేషాలను తిలకించేందుకు గుట్టలో ఏర్పాటు చేసిన మ్యూజియంను యాత్రికులు తిలకించవచ్చు.

లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయం: ప్రధాన ఆలయం సమీపంలో యోగి లక్ష్మీ నర్సింహ స్వామి దేవాలయం ఉంది. స్వామి దర్శనానంతరం భక్తులు ఇక్కడ గల యోగి లక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకోవచ్చు.

తిరుగు ప్రయాణంలో..: ఇక కీసర రామలింగేశ్వరుడి దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో చీర్యాల లక్ష్మీనర్సింహ స్వామి, నాగారంలో గల శివాలయం, షిర్డీ సాయిబాబా ఆలయాలను కూడా భక్తులు దర్శించుకోవచ్చు.

అతిరథ మహాయాగం నిర్వహించే ప్రదేశం: సప్తసోమ యాగాల్లో ఒకటైన అతిరథ మహా యాగాన్ని తపస్స్ సంస్థ ఆధ్వర్యంలో కేరళకు చెందిన నంబూద్రి వంశస్తులు కీసరగుట్టలో 2013 ఏప్రిల్‌లో పది రోజుల పాటు నిర్వహించారు. ఈ యాగంతో ఈ ప్రదేశం ఎంతో పవిత్రను సంపాదించుకుంది. యాత్రికులు కీసరగుట్ట జాతరకు విచ్చేసి గుట్టలో అతిరథ మహాయాగం జరిగిన స్థలాన్ని కూడా సందర్శించుకోవచ్చు.

సింగరేణి విశ్రాంత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సింగరేణి విశ్రాంత కార్మికుల సమావేశం

కీసర: సింగరేణి విశ్రాంత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో గల సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్‌రావు కోరారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని సిద్ధార్థనగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి విశ్రాంత కార్మికులకు పెన్షన్ పెంపుదలపై జాతీయ కార్మిక సంఘాలు కృషిచేయాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు దేశ వ్యాప్తంగా అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా మెడికల్ కార్డు ద్వారా అందించాలన్నారు. 2017 జనవరి 31వ తేదీ నుండి అధికారులకు చెల్లించినట్లుగా కార్మికులకు 20 లక్షల గ్రాట్యూటీ చెల్లించాలని, సింగరేణి అధికారులకు, ఉద్యోగులకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించినట్లుగా హైదరాబాద్‌తో పాటు అన్ని నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్న విశ్రాంత ఉద్యోగులకు వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్నారు. సింగరేణి ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను విశ్రాంత కార్మికులు నివసించేందుకు అనుమతివ్వాలన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు ఆళవందర్ వేణుమాధవ్, కార్యదర్శి బానయ్య, కోశాధికారి విజయ్‌బాబు, కార్యవర్గ సభ్యులు కుమార స్వామి, తమ్మెరరాజ్ కుమార్, జీవీ రాజిరెడ్డి, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

'భూ రికార్డుల్లో మా పేర్లు నమోదు చేయండి'



వారివారి భూ రికార్డులు ప్రదర్శిస్తున్న బాధితులు

ఘట్‌కేసర్: మూడు దశాబ్దాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నందున భూ రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేయాలని గండయ్య, సంజీవ, సులోచన అన్నారు. ఆదివారం అంకుషాపూర్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్.166లో 33 గుంటల భూమి ఉందని, ఇదే సర్వే నంబర్‌లోని భూమిని కొందరు విక్రయించినా తిరిగి వారి పేర్లు రికార్డుల్లో వస్తున్నాయని, తాము మా భూమిని విక్రయించకున్నా రికార్డుల్లో నమోదు కావడం లేదన్నారు. దయచేసి అధికారులు పాత రికార్డులు పరిశీలించి భూ రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేయాలని వేడుకున్నారు.

మల్లన్న జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



మంత్రి మల్లారెడ్డిని జాతరకు ఆహ్వానిస్తున్న దృశ్యం

మేడ్చల్: వందల సంఖ్యలో భక్తులు పాల్గొనే గౌడవెల్లి శ్రీమల్లికార్జున స్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్థానిక సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆదివారం ఏర్పాట్లను పరిశీలించిన ఆయన సోమవారం నుంచి మొదలయ్యే జాతరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాలుగా వసతులు కలిపిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి, నాయకులు సింహల్ యాదవ్, కృష్ణయాదవ్, యాదవసంఘం సభ్యులు ఉన్నారు.

మంత్రికి ఆహ్వానం..

మల్లికార్జున స్వామి జాతరకు హాజరు కావాలని మంత్రి మల్లారెడ్డిని ఆయన నివాసంలో కలిసిన మండల బీఆర్ఎస్ నాయకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జగన్‌రెడ్డి, రాజ మల్లారెడ్డి, నాయకులు భాష్యారెడ్డి, దయానంద్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

విలువలతో కూడిన విద్యను అందిస్తేనే మంచి గుర్తింపు



స్వామినారాయణ్ గురుకుల పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: విలువలతో కూడిన విద్యను అందించిన విద్యా సంస్థలకే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ-హరిదాస్‌పల్లి రహదారిలో ఏర్పాటు చేసిన శ్రీస్వామినారాయణ్ గురుకుల పాఠశాలను శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

'బహుజనుల్లో అంబేడ్కర్ వెలుగులు నింపారు'

ఘట్‌కేసర్: రాజ్యాంగం ద్వారా హక్కులు ప్రసాదించి బహుజన వర్గాల్లో అంబేడ్కర్ వెలుగులు నింపారని ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ మండల బాధ్యుడు అరుణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, అయోధ్య, దాసు, నర్సింహ, బాలయ్య, రాందాసు, శ్రీనివాస్, రాజేశ్, నవీన్‌కుమార్, గణేశ్, నారాయణ, సత్యనారాయణ, జంగయ్య, రూపేశ్, నవీన్, చంద్ర, వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

కార్యకర్తలను ఆదుకుంటాం



మేడ్చల్: సుదీర్ఘ కాలంగా పార్టీకి సేవలు చేసి అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తను అన్ని విధాల ఆదుకుంటామని పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మేడ్చల్ మున్సిపల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గిర్మని నర్సింహ అనారోగ్యంతో మంచపట్టడంతో ఆయన నర్సింహను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఏ-బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్, కౌన్సిలర్ శ్రీనివాస్, పట్టణ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.

'కుతాడి శ్రీనివాస్‌ను నమ్మి మోసపోయాం'

మాకు న్యాయం చేయండి: బాధితులు



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

మేడ్చల్: పలు భూ కేసుల్లో అరెస్టయిన జవహర్‌నగర్‌కు చెందిన కుతాడి శ్రీనివాస్ అలియాస్ ఎరుకుల శ్రీను చేతిలో తాము మోసపోయామని మేడ్చల్‌లోని ఆయన వెంచర్ బాధితులు అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... సర్వే నంబర్.325 ఇతర సర్వే నంబర్లలోని భూమిలో వెంచర్ ఏర్పాటు చేయగా అందులో గజాలు, గుంటల్లో భూమిని అగ్రిమెంట్ చేశారని, విల్లాలు నిర్మింపజేస్తానని, ప్లాట్లు అభివృద్ధి చేస్తామని చెప్పి ముందుగా ఎంఓయూలు, అగ్రిమెంట్లు చేసుకుని లక్షల రూపాయలు అడ్వాన్సులుగా తీసుకున్నారన్నారు. పదేళ్లు గడుస్తున్నా తమకు ఎలాంటి ప్లాట్లు చూపలేదని, తమకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని, లేదంటే తమ డబ్బులు తమకు ఇవ్వాలని ఎన్నో సార్లు ఆయన ఇంటికి వెళ్లి అడిగినా ఆయన ఇవ్వలేదన్నారు. ఎవడికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. ఎక్కువ చేస్తే చంపేస్తామని బెదిరించారని తెలిపారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని, తమ వద్ద పత్రాలను పరిశీలించి శ్రీనివాస్‌పై కేసులు నమోదు చేయాలని వారు పోలీసులను కోరారు. సమావేశంలో బాధితులు ఈస్ట్ మారేడుపల్లికి చెందిన హరదీప్‌సింగ్ చాటి, కొంపల్లికి చెందిన లక్ష్మీకాంత్ పాండే, మేడ్చల్‌కు చెందిన వరుణ్, సోమాజీగూడకు చెందిన బాబు, గీతాదేవి, గురుసింగ్ రాథోడ్, స్వప్న, తదితరులు ఉన్నారు.

వినూత్న ఆవిష్కరణలకు చురుగ్గా ఉండాలి



వర్క్‌షాప్ ముగింపులో కళాశాల చైర్మన్ రవీందర్‌రెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు

కీసర: వినూత్న ఆవిష్కరణల కోసం విద్యార్థులు చురుకుతనాన్ని కలిగి ఉండాలని గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ చైర్మన్ జీఆర్ రవీందర్‌రెడ్డి అన్నారు. కీసర మండలం చీర్యాల గ్రామంలో గల గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మొదటి సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో డిజైన్ థింకింగ్ క్లబ్ ఆఫ్ ఫ్రెష్మాన్ ఇంజినీరింగ్ అనే కార్యక్రమంలో భాగంగా 15 రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా రిసోర్స్‌పర్సన్స్ టెక్నాలజీ హెడ్ దింత్యాల అరుణ్ భరద్వాజ్, హెడ్ ప్రొడక్షన్ ఇన్నోవేషన్ వేమాలి లలిత్ కుమార్‌లు విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ వర్క్ షాప్‌లో సుమారు 270 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయ్‌కుమార్, ఫిజిక్స్ ప్రొఫెసర్, శిక్షణా శిబిరం కన్వీనర్ డాక్టర్ జి.నీరజరాణి, క్లబ్ కోఆర్డినేటర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



తన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం మంత్రి మల్లారెడ్డి సమక్షంలో కేక్‌కట్ చేసిన గోధుమకుంట సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఉప సర్పంచ్ ఆంజనేయులు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నేతలు, తదితరులు. – కీసర